23.5.84

# నీతో... నువ్వేటు?

యం. ఉమామహేశ్వరరావు

**అయిదో నంబరు** ప్లాటుఫారంపై క్రిక్కిరిసి ఉన్న జనం మధ్య నుంచుని పట్టాలవేపు చూస్తున్నాడు మూర్తి. ఒక చేతిలో బరువుగా ఉన్న సూట్‌కేస్, మరో చేతిలో నాలుగైదు పత్రికలు ఉన్నాయి.

అతని మనస్సు నిండా ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. జేబులో 'సామర్లకోట' వరకూ తీసుకున్న టిక్కెట్ ఉన్నా, అంతమంది జనసంద్రం మధ్యనుంచి ట్రెయిన్ ఎక్కగలనా, లేదా అన్న అనుమానం తొలి చెయ్యడంతో ముందుగా కొంచెం సేపు ఆందోళన పడ్డాడు. ఎలాగైనా రాత్రి కల్లా మరలా సామర్లకోట చేరిపోవాలి. సుమన ఎదురు చూస్తూ ఉంటుంది. పిల్లలు సరేసరి. నిమిషానికో సార్లైనా తను గురించి వాకబు చేస్తుంటారు.

తెలిసిన స్నేహితుడొకాయన వివాహానికి విజయవాడ వచ్చాడు ముందు రాత్రే. తెల్లవారు జాము లగ్నం. తెల్లార్లూ సరిగ్గా నిద్ర లేదు. ఒకటే నిస్సత్తువగా ఉంది ప్రాణం. ఉదయం లేచి స్నానాదులు ముగించుకుని, 'కనకదుర్గ' గుడికెళ్ళి దర్శనం చేసుకుని తిరిగి రూమ్‌కు వచ్చేసరికి పన్నెండు గంటలయింది. వెంటనే భోజనం కానిచ్చి స్టేషనుకు వచ్చేశాడు. ఒకటీ ముప్పై అయిదుకు గుంటూరు నుంచి హౌరా పోయే ఈస్ట్‌కోస్ట్ ఉందని తెలిసి



తేలిగ్గా ఊపిరి పీల్చుకో గలిగాడు.

మూర్తి ఆలోచనల్లో ఉండగా ఎనౌన్స్‌మెంట్ వినిపించింది. మరో అయిదు నిమిషాల్లో గుంటూరు నుంచి హౌరా పోవు ఈస్ట్‌కోస్టు అయిదో నంబరు ప్లాట్ ఫారం మీదకు వస్తోందన్న వార్త చెవిన పడటంతో అంతవరకూ అక్కడక్కడా కబుర్లు చెప్పుకుంటున్న ప్రయాణీకులంతా ఒక్కసారిగా అలర్ట్ అయిపోయారు.

“అయ్యగారూ!”

మెల్లిగా, బాగా దగ్గరగా వినిపించిందో కంఠస్వరం. ఠక్కున అటు వేపుగా చూశాడు మూర్తి.

అస్థిపంజరానికి ఎర్రటి గుడ్డలు తొడిగినట్లుగా ఉన్నాడామనిషి. అతని శరీరం మీద మాంసం మచ్చుకైనా ఎక్కడా కనిపించలేదు. తెల్లబారిన కళ్ళు కొడిగట్టే దీపాల్లా ఉన్నాయి.

“ఈ బండికి మీకు సీటు కావాలా, సార్?” వినయంగా అడిగాడతను.

మూర్తి అతడి వేపు మరో పర్యాయం చూశాడు.

‘మనుష్యుల మనోభావాల్ని ఇట్టే పసిగట్టగలిగే శక్తి వీడి కెలా వచ్చిందబ్బా?’ అనుకుని కాస్సేపు ఆశ్చర్య పడినా, ఆ వెంటనే తేరుకున్నాడు.

రిజర్వేషను చేయించుకున్న మనిషి నించునే తీరా ..

బండి ప్లాట్‌ఫారం మీదకు వచ్చి ఆగినా కంగారు పడని స్థైర్యమూ.

అది లేని మనిషికి రాదు. ఎక్స్‌ప్రెస్ ట్రెయినుకుండే రెండే రెండు జనరల్ కంపార్ట్‌మెంటుల్లో కనీసం కాలు మోపేందుకు ఇంత జాగా దొరికితే చాలన్నట్లుగా ఉంటుంది పరిస్థితి.

ఇలాంటి సమయాన్నే చాలా తెలివిగా ఉపయోగించుకుంటారు చాలా మంది పోర్టర్లు.

“కిటికీకి దగ్గరున్న సీటు చూస్తాను, సార్! అయిదు రూపాయలివ్వండి—చాలు. అదీ మిమ్మల్ని సీట్లో కూర్చో పెట్టాకనే డబ్బులివ్వండి!” ప్రాధేయ పడ్డాడతను.

మూర్తి మెదడు ఆలోచనల్లో పడింది.

చీమల బారుల్లా, తీపి మీదకు ఒక్కసారిగా మూగిన ఈగల్లా ప్లాట్‌ఫారం మీద ఇరుకిరుగ్గా నించున్న ఆ జన ప్రవాహాన్ని చూడ్డంతో ముచ్చెమటలు పోసేశాయి. అంతమంది జనం మధ్యనుండి లోపలకు వెళ్ళడం చాలా కష్టం. ఒక వేళ వెళ్ళినా సీటు సంపాదించు కోవడం మరీ కష్టం.


మూర్తి అతని వేపు చూశాడు.

“సరే. నువ్వడిగిన అయిదూ ఇస్తాను. అదీ కార్నర్‌గా... కిటికీ దగ్గరున్న సీటయితేనే ఇస్తాను. లేకపోతే లేదు” అన్నాడు.

“సో! అలాగే, సార్! మీ కెందుకు? మీ రలా ఇక్కడే నించోండి. అదిగో బండి వచ్చేస్తోంది. సీటు చూసే పూచీ నాది” అంటూ అతను గబగబా బండి వస్తున్న వేపు పరుగెత్తాడు అలవాటుగా.

• • • •

“హమ్మయ్య! ఫరవాలేదు. ఎలాగయితేనేం, సీటు సంపాదించావు. ఇదిగో నువ్వడిగిన అయిదు రూపాయలూ తీసుకో!” అంటూ అతని చేతిలో అయిదూ ఉంచాడు మూర్తి.




అతని కళ్ళు ఆనందంతో మెరిసిపోయాయి.

అందరాని చందమామ హఠాత్తుగా ఒడిలో వాలినట్టుగా ఉండిపోయాడు ఓ నిమిషం. మూర్తి తన సీటో సర్దుకుని కూర్చున్నాడో, లేదో చిలచిలమంటూ వరద ముంపులా వచ్చి కంపార్ట్‌మెంటంతా క్రిక్కిరిసి పోయారు ప్రయాణీకులు.

ఇసక వేస్తే రాలనంతగా ఉంది కంపార్ట్‌మెంటు.

పాతికో, ఇరవైయ్యో పెట్టెలున్న ఆ ట్రెయిన్‌లో ఇంజనుకు వెనక, ఆఖర్న గార్డు పెట్టెకు ముందుగా రెండే రెండు జనరల్ బోగీలున్నాయి. మిగతా వన్నీ క్లాసుల వాళ్ళకి.

ప్రజలను క్లాసుల వారీగా మధ్య పెట్టి, దోపిడి చేస్తున్న రైల్వే విధానాలు ఈసడింపుగా తోచాయి మూర్తికి.

దేశంలో సగం మందికి పైగా జనరల్ క్లాసులో ప్రయాణించే వాళ్ళని తెలిసికూడా బండికి రెండే రెండు పెట్టెలు అమర్చి, ఆ రెండింటిలోనే జనాన్ని తన్నుకోమంటున్న రైల్వే అధికారానికి మనస్సులోనే జేజే లర్పించాడు. తన జేబులో అయిదు ఉంది. తన మనస్సులో జనం మధ్య నలిగి పోకూడదన్న భయం ఉంది. అందుకే అయిదూ ఖర్చయినా సీటు సంపాదించుకున్నాడు. తద్వారా ఒక బీదవాడికి సాయం చేసినట్లూ ఫీలయ్యాడు మూర్తి. కాని డబ్బిచ్చి సీటు కొనుక్కోవడం నేరం కాదా? అని అడగవచ్చు ఎవరైనా. కాదు—నేరం కానే కాదు. ఒక రకంగా చెప్పాలంటే క్లాసుల్లో జరిగేదీ, ఇక్కడ జరిగిందీ ఒక్కటే. క్లాసులోది డైరెక్టుగా పెద్దవాళ్ళ జేబుల్లోకి.... ఇక్కడిది పాపం! పూటకు ఇన్ని గంజి నీళ్ళకైనా నోచుకోని పోర్టర్ల దీను.

ఏది న్యాయం? ఏదన్యాయం? అని ఆలోచించి చూడగలిగే ఓపిక ఎంతమంది కుందీ రోజుల్లో?

మూర్తి ఇలా ఆలోచనల్లో ఉండగానే బయట కిటికీ సమీపంలోనే మాటలు వినిపించాయి. చటుక్కున తల తిప్పి అటుగా చూశాడు మూర్తి.

“బాబ్బాబూ! అయ్యే ఉన్నాయండి. నిన్నటి నించి ఇంటో గంజినీళ్ళు లేవండి. ఇప్పుడేం ఇచ్చుకో లేనండి!”

తనకు సీట్ చూపిన పోర్టరు బతిమాలసాగాడతన్ని.

అతను...

ఈ సమాజ పరిరక్షణా బాధ్యతకు నడుం కట్టాల్సిన పోలీసు జవాన్. ప్రజలను దొంగల నుంచీ, దోపిడీదారుల నుంచీ రక్షించాల్సిన పని మాని, పేదోళ్ళని, తిండికి సైతం నోచుకోని కూలీలని దోచుకుని తినే మనస్తత్వ మానవులకు ప్రతినిధి.

“ఏ యబ్బ! ఒక్క టిచ్చావంటే, బండి కింద కెళ్ళి పోతావు రోయ్! మర్యాదగా అయిదూ తీసిచ్చి మరో బండికి మరో బేరం చూసుకో. ఇలా ప్రజల్ని దోచుకుంటున్న నీ లాంటోళ్ళని సీకటి కొట్లో తోసెయ్యాల!” అంటూ ఆ పోర్టరు చేతుల్లోంచి అయిదూ అందుకోవడానికి ప్రయత్నించాడు పోలీసు జవాన్.

“మీ కాళ్ళమీద పడి దండ పెడతానండి. ఈ పాలికి ఒగ్గేయండి, బాబూ. ఆనక మరో బండి కాడ సంపాదించిందిచ్చుకుంటాను. ఇయ్యి పేలులు గావు. పిల్లల కడుపులో కిన్ని గంజినీళ్ళు పొయ్యడాని కొత్తా యీ డబ్బులు.”

పోలీసు జవాన్ కాళ్ళట్టుకున్నాడు పోర్టరు.

రాయైనా కరుగుతుందేమో కానీ, జవాన్ మనసు కరగలేదు.

“ఏ యబ్బ! చెబుతుంటే నీ క్కాదేటిరా. దొమ్మర్నాయాల. లే. ఇలా, తే!”

అంతే! అది విసురుగా—బలంగా—దవుర్జన్యంగా పాపం! పోర్టరు చేతిలోంచి అయిదూ అందుకుని తన పాంటు జేబులో కుక్కుకుని నించున్నాడు జవాన్.

పోర్టరు అసహనంగా, అయోమయంగా జవాన్ కేసి చూస్తూ బాధగా అక్కడినించి కదిలాడు.

ట్రెయిన్ మరో నిమిషంలో కదిలింది.

మూర్తి మనసు కుతకుతమని ‘లావా’లా మరిగిపోయింది.

“బలవంతంగా ఆ బీదవాడి దగ్గర అయిదూ లాక్కునే కంటే, కంపార్ట్‌మెంటంతా తిరిగి చేతులు సాచి అడుక్కోరాదూ?”

ఎంతో ఆనందంతో తను ఆ పోర్టరు కిచ్చిన

అయిదు రూపాయలూ అన్యాయంగా, దుర్మార్గంగా లాక్కున్న ఆ పోలీస్ జవాన్ మీద విపరీతమైన కోపం వచ్చింది మూర్తికి.

అయినా తమాయించుకున్నాడు.

ఎగిసి పడుతున్న ఆవేశ తరంగాల్ని అదుపు చేసుకున్నాడు.

ప్రయాణికులంతా ఎవరికి వారే ఆ ఇరుకులో మరీ ఇరుగ్గా ప్రయాణిస్తున్నారు. కిటికీ గుండా పైకి చూస్తూ కూర్చున్నాడు మూర్తి.

"కొంచెం సీటిస్తారా? పాపం! ఆడకూతురు. నిండు చూలాలు. నించోలేక పోతూంది." చాలా మర్యాదగా, నెమ్మదిగా వినిపించిందో గొంతు.

మూర్తి మనస్సు చివుక్కు మంది.

నిండు చూలాలన్న అభిమానంతో... జాలితో... తను లేచి తన సీటును ఆమె కిస్తే తనెలా ఆ జనం మధ్య నలిగే కుమిలి పోతాడో స్ఫురించింది మూర్తికి. మరో అయిదు గంటల సేపు ఆ రష్‌లో ఒంటి పాదం మీదనో, లేదా రెండు పాదాల మీదనో నించోవాలి. అదో నరకం...బాధను మాటలో వర్ణించ లేనిది.

మూర్తి మౌనంగా కూర్చుండిపోయాడు. మానవత్వమూ—జాలీ అనే వాటిని కాస్సేపు ప్రక్కన పెట్టి నిశ్చబ్దంగా కూర్చున్నాడు.

"పాపం! గర్భిణితో ఉన్న ఇల్లాలు. నిలవలేక బాధపడి పోతుంటే, అలా నాపరాయి లాగ కూర్చోపోతే లేచి ఆవిడకు సీటు ఇవ్వకూడదూ? రైల్వే సీటులు మీ తాతగారి ఆస్తేం గాదు!"

కరుగ్గా వినిపించిందో కంఠం జనం మధ్యనుంచి. అటు చూశాడు మూర్తి. ఇందాకటి పోలీసు జవాన్ కనిపించాడు.

ఒళ్ళు మండింది.

"పేదవాళ్ళ కడుపుల్ని నిర్దాక్షిణ్యంగా కొట్టుకుంటూ బతికే నీ కంటే నయం ఎవరన్నా! రైల్వేలు మా తాతగారి ఆస్తీ కాదు, మీ తాతగారి ఆస్తి అసలే కాదు" అని అందామనుకున్నాడు మూర్తి.


ఆ పరిస్థితుల్లో నిండు గర్భంతో అవస్థపాలు పడుతున్న ఆమెకు సీటివ్వడం మానవత్వం కిందకే వచ్చినా, "ఉపన్యాసిత ధర్మం" కాకూడదని నిర్ణయించుకుని మౌనంగా వూరుకున్నాడు. జవాబివ్వలేదు.

"అలా వూరుకుంటా వేటయ్యా? లే. లేచి ఆ ఆడకూతురుకి సీటివ్వు. రేపొద్దున్న నీ భార్యకో, కూతురికో ఇలాటి పరిస్థితి వస్తే? సీటియ్యవా?"

సూటిగా మూర్తినే చూస్తూ బిగ్గరగా అన్నాడా పోలీసు జవాన్.

"అయినా మీ కెందుకు? ఈ సీటు నేను డబ్బిచ్చి కొనుక్కున్నాను. ఇంతమంది జనంలో నలిగి బాధ పడేకంటే అయిదు రూపాయలు ఖర్చయినా ఫరవా లేదనుకున్నాను. ఆమెకు సీటివ్వాలని నాకూ ఉంది. కాని ఇవ్వలేను. ఎందు కివ్వనూ? అని అడిగే హక్కు మీ కెవ్వరికీ లేదు. దయచేసి అనవసరంగా నోరు పారేసుకోవద్దు."

తనూ కోపంగానే అన్నాడు మూర్తి. పోలీసు జవాన్ వూరుకో లేదు.




"అసలీ జనం మధ్య నిలబడటానికే చోటు లేని దగ్గర నీకే ఏదో సీటుందని, డబ్బిచ్చి కొన్నానని చెబితే ఎవ్వరూ నమ్మరిక్కడ. మీ వంటి చదువుకున్న వాళ్ళు ఇలా అక్రమంగా—అన్యాయాల్ని ప్రోత్సహిస్తే ఇక ఈ దేశంలో న్యాయం, ధర్మం, ఉండే దెక్కడ? పాపం! నిండు చూలాలు కదా! నిలబడటానికే చోటు లేదు. నువ్వేమో దర్జాగా కూచున్నావు."

పోలీసు ఈ సారి కాస్త తక్కువ స్వరంతో అన్నాడు. జనం ఎవరికి వారే ఆ పోలీసును సపోర్టు చేస్తూ, ఆమెకు లేచి సీటు ఇవ్వనందుకు తలా ఒక మాటా విసిరేరు మూర్తిని.

మూర్తి మనస్సు బాధగా అయిపోయింది. భరించ లేకపోయాడు. నిలవలేకపోయాడు. నలుగురూ నాలుగు విధాల తను కూర్చున్న సీటు ఖాళీ చేసి ఆమెకు ఇప్పించడానికి పూనుకున్నట్లు కనిపించింది వాతావరణం. తను ఒక్కడు...జనం మధ్య దోషిలా నిలబెట్టేయబడ్డాడు.

"సరే. ఆమెకు సీటిస్తాను!" అంటూ లేచి ఆ గర్భిణి స్త్రీకి తన సీటు ఇచ్చేసి నించున్నాడు మూర్తి.

ఏదో స్టేషన్ రావడంతో ట్రెయిను ఆగింది.

పోలీసు జవాన్ కిందకు దిగాడు.

అతనితో పాటుగా ఒక యాభై సంవత్సరాల ఆసామీ కూడా దిగాడు.

"చూశారా! మన సంగతి! ఈ పోలీసు అప్పారావుతో పేచీ అంటే ఎవరూ నిలబడ లేరు. మీ అమ్మాయికి శుభ్రంగా సీటు ఇప్పిస్తానన్నాను. ఇప్పించేసేను. మరి?... నా కిస్తానన్న అయిదూ ఇచ్చేయండి త్వరగా. ఇక్కడే ఉండిపోవాలి నేను."

పోలీసు జవాను మాటలకు ఆ ఆసామీ తల పంకించాడు. తన చొక్కా జేబులోంచి పది రూపాయల నోటు తీసి అతని చేతుల్లో పెడుతూ— "చాలా సహాయం చేసేరండీ! మీ మేలు మరిచి పోలేం!" అన్నాడు.

"దానికేం లెండి. పోలీసు అన్నాక ప్రజల కష్ట సుఖాలు చూసుకోక పోతే ఎలా?" అంటూ జేబులో అంతకు మునుపు పోర్టరు దగ్గర లాక్కున్న అయిదూ ఆ ఆసామీ కిచ్చి, అతనిచ్చిన పదీ జేబులో దోపుకున్నాడు.

"మరి ఉంటానండి! అదిగో—బండి కదులుతూంది. వస్తాను" అంటూ ఆ ఆసామీ ట్రెయిను ఎక్కేశాడు.

పోలీసు జవాన్ చిరునవ్వు నవ్వుతూ కదిలి వెళ్ళి పోతున్న ట్రెయిన్ కేసి చూస్తూ నించుండి పోయాడు.

ఇదంతా చూస్తున్న మూర్తికి ఒళ్ళు మండి పోయింది. సీటు కోసం తను అయిదు రూపాయలు పోర్టరు కిస్తే, ఆ పోర్టరు నుంచి బలవంతంగా, జులుం చూపించి, అయిదూ లాక్కుని వాడి కడుపు కొట్టింది చాలక, పైగా తన సీట్లో ఆ పెద్ద మనిషి గర్భిణీ కూతుర్ని కూచోపెట్టి మరో అయిదు సంపాదించిన ఆ పోలీసు జవాన్ మీద జుగుప్స కలిగింది.

'వీళ్ళ వల్లే సమాజంలో పోలీసుల పట్ల అసహ్యం, ద్వేషం రగులుతూంది' అనుకున్నాడు. ఆ మాటే అన్నాడా ఆసామీతో.

అందు కతను నవ్వేశాడు మూర్తి మాటలకు.

"మరేం బాధ పడకండి, మాస్టరూ!"

మూర్తి కా మాటలు అర్థం కాలేదు.

"ఇంకా బాధ పడవద్దంటా రేంటండీ? ఆ పోర్టరు దగ్గరయిదూ, మీ దగ్గర అయిదూ కొట్టేసింది చాలు వాడికి" అన్నాడు మూర్తి ద్వేషంగా.

"అందుకే బాధ పడవద్దంటున్నాను — వాడికి తగిన శాస్తే జరిగింది."

"అదెలా?" మూర్తి ప్రశ్నించాడు ఆత్రంగా.

"ఎలాగేమిటండీ? వాడి దగ్గరున్న అయిదు రూపాయలూ నా దగ్గర కొచ్చేశాయి. నా దగ్గర పదీ వాడి కెళ్ళింది కదా!"

ఆశ్చర్యంగా చూశాడు మూర్తి.

"ఇంకా అలా ఆశ్చర్యంతో చూస్తా రేంటండీ? అర్థం కాలేదా మీకు? వాడికి నే నిచ్చిన పది రూపాయల నోటు చెల్లదు!"

అంతే!

మూర్తి ముఖం తిరిగింది. *